క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక తన కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరు అయిన రూ.7.50లక్షల చెక్కును ఆయన బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వం ఎన్నో రోగాలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వినతి పత్రాల స్వీకరణ

వివిధ సమస్యలతో వచ్చిన నగర ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతిపత్రాలు స్వీకరించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఎమ్మెల్యే దర్బార్ నిర్వహించారు.

వైద్యులకు అరియర్స్ చెల్లించాలని వినతి



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న వైద్యుల సంఘం నాయకులు

కర్నూలు(హాస్పిటల్): ఆరేళ్లుగా బకాయి ఉన్న పీఆర్‌సీ అరియర్స్ చెల్లించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ప్రభుత్వ వైద్యులు వినతి పత్రం సమర్పించారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చిన మంత్రికి ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు కలిశారు. 2016 నుంచి 2021 వరకు చెల్లించాల్సిన అరియర్స్ విడుదల చేయాలని కోరారు. అంతకుముందు సంఘం నాయకులు ఓల్డ్ క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో అధ్యక్షుడు డాక్టర్ డి. శ్రీరాములు, కార్యదర్శి డాక్టర్ విజయమోహన్‌రెడ్డి, డాక్టర్ దమామ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కల్లూరు: అర్బన్ పరిధిలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముజఫర్‌నగర్ జెడ్పీహెచ్‌సీ, ఎంపీపీ పాఠశాల, పందిపాడు ఎంపీపీ పాఠశాల పోలింగ్ కేంద్రాలను మంగళవారం జేసీ నారపురెడ్డి మౌర్య పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాలను ఓటర్లకు అవసరమైన మౌలిక వసతులను, సౌకర్యాలపై ఆరా తీశారు. జేసీతో పాటు తహసీల్దార్ రమేష్ బాబు వెంట ఉన్నారు. అలాగే తహసీల్దార్ రమేష్ బాబు కల్లూరు అర్బన్ పరిధిలోని శరీన్ నగర్ ఎంపీపీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఎంఈఓ శ్రీనివాసులుతో కలసి పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వడ్డించారు.

శంకరాస్ విద్యార్థి ప్రతిభ



కరాటేలో ట్రోఫీ, బంగారు పతకం సాధించిన రేవంత్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): కరాటే పోటీల్లో స్థానిక శ్రీ శంకరాస్ కళాశాల విద్యార్థి ప్రతిభ చాటాడు. ఈనెల 25,26 తేదీల్లో తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో 16 వ జాతీయ స్థాయి ఇన్విటేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న కళాశాల విద్యార్థి రేవంత్‌కుమార్ కటాస్ పోటీల్లో బంగారు పతకం, కుమితీ విభాగంలో గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించి మొదటి స్థానంలో నిలిచారు. మంగళవారం కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, డైరెక్టర్ హరికిషన్ అభినందించారు.

ఏఐకేఎస్ సమావేశాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆర్.నరసింహులు

కర్నూలు(సెంట్రల్) : డిసెంబర్ 15,16,17న కర్నూలులో జరిగే ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు ఆర్. నరసింహులు పిలుపునిచ్చారు. మంగళవారం ముజఫర్ నగర్‌లో హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశాలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ..జాతీయ కౌన్సిల్ సమావేశాలకు కేరళ ఆర్థిక శాఖమంత్రి కె.బాలగోపాల్, ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు అశోక్ దాలే, ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఉపాధ్యక్షుడు హన్నన్‌మొల్ల ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నట్లు చెప్పారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సుధాకరప్ప, కె.సురేష్ పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

- ఆయన ఆశయ సాధన సీఎం వైఎస్ జగన్ కృషి
- వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య



వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో పూలేకు నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్): మహాత్మాజ్యోతిరావు పూలే బలహీన వర్గాల ఆశాజ్యోతి అని వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. మంగళవారం పూలే వర్ధంతిని పురస్కరించుకుని బిర్లా కాంపౌండ్ సమీపంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పూలే ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. అణగారిపోయిన వారికి సమాజంలో గుర్తింపు కల్పించారని చెప్పారు. ఆయన ఆశయ సాధన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అన్ని వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బాటలు వేశారన్నారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు 50 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించారని, దీంతో అన్ని కార్పొరేషన్లు, మార్కెట్ యార్డులు, ఇతర నామినేటెడ్ చైర్మన్, డైరెక్టర్ పదవుల్లో సగ భాగం వారే ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుబాష్‌చంద్రబోస్, నాయకులు సీహెచ్ మద్దయ్య, ధనుంజయ ఆచారి, యూనుస్, లక్ష్మీ కాంతయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(టౌన్) : స్థానిక బిర్లా గేట్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి మేయర్ బీవై రామయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే అందించిన సేవలను గుర్తు చేశారు

విద్యా ప్రదాత పూలే

కర్నూలు కల్చరల్: విద్యా ప్రదాత మహాత్మా జ్యోతి రావు పూలే అని జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి పెద్దక్క అన్నారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సహాయ గ్రంథాలయాధికారి గోవిందరెడ్డి, బాషారేణుక, చంద్రమ్మ, నసీమాబీ, తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధకులు వైఎస్ జగన్

కర్నూలు(అర్బన్): మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు పరుస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ అన్నారు. మంగళవారం పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక బిర్లాగేట్ సమీపంలోని ఆయన విగ్రహానికి సుభాష్‌తో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, మైనారిటీ విభాగం నంద్యాల జిల్లా యూనస్‌బాషా, నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. సుభాష్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం కోసం మహాత్ములు కన్న కలలు నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ద్వారా నెరవేరుతున్నాయన్నారు. పూలే కోరుకున్న విధంగానే మన రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్య కోసం జగనన్న విద్యా దీవెన, విదేశాల్లో చదివేందుకు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతరెడ్డి, నన్నూరుబేగ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ భవన్‌లో ...

పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్ ఎదురుగా ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు బీసీ జేఏసీ నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీ కాంతయ్య, సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులునాయుడు, నాయకులు గిడ్డయ్య, చంద్రకళాబాయి, సర్వేస్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావుపూలే అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. మంగళవారం పూలే వర్ధంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యకరమంలో మాజీ మంత్రి మారెప్ప, బతుకన్న, బాజరన్న పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న నేతలు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పూలే ఆశయాలను సాధిద్దాం



పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను సాధిద్దామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు.మంగళవారం జ్యోతి రావు పూలే వర్ధంతి సందర్భంగా కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా.. పూలే ఆశయాలను నేరవేర్చుతూ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జయరాముడు, సుదర్శన్‌రెడ్డి, నాయకులు తిరుపాల్, నాగమద్దిలేటి, శివారెడ్డి, రత్నం, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నగరంలో అన్ని వార్డులు అభివృద్ధి చేస్తాం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నగర మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని
- 20వ వార్డులో రూ. 50 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

కల్లూరు: నగరంలో అన్ని వార్డులు అభివృద్ధి చేస్తామని నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 20వ వార్డు ధనలక్ష్మీనగర్‌లో రూ. 50లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించి, శిలాఫలకం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ నగర పరిధి రోజు రోజుకు విస్తరిస్తోందన్నారు. నగరంలో ప్రాధాన్యతలను అనుసరించి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. పాలక వర్గం వచ్చాక నగరంలో అనేక అభివృద్ధి పనులు చేయడంతో నగర వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వాలు ఓటమి భయంతో నగర పాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మీరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జయరాముడు, కల్లూరు అర్బన్ క్లస్టర్-1 అధ్యక్షుడు భీమా శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహిద్దాం



కనకదాసు జయంతిపై చర్చిస్తున్న కురువ సంఘం ప్రతినిధులు

కర్నూలు(అర్బన్): భక్త కనకదాసు జయంతి ఉత్సవాలను ఈ నెల 30వ తేదీ గురువారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కురువ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే రామక్రిష్ణ, జిల్లా కోశాధికారి వెంకటరాముడు, నాయకులు పరమేష్, ఎల్లప్ప తదితరులు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షమ్మను కలిసి జయంతి ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనకదాసు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కర్నూలు బీసీ భవన్ ప్రాంగణంలో భక్త కనకదాసు విగ్రహం ఏర్పాటు చేసిన దృష్ట్యా అక్కడే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మ బీసీ భవన్‌ను పరిశీలించి, సభ నిర్వహణపై అక్కడే ఉన్న బీసీ, కురువ సామాజిక వర్గానికి చెందిన నేతలతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ డా. జీ సృజన ఆదేశాల మేరకు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్, మధు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కులగణన సర్వే



మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): వచ్చే నెల 10 వ తేదీ నుంచి కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాలులో మున్సిపల్ అధికారులు, సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న 136 సచివాలయాల పరిధిలో సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పక్కా సమాచారం సేకరించాలన్నారు. ప్రభుత్వం ఈ సర్వేకు సంబంధించి ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తుందన్నారు. జనాభా ప్రాతిపదికన ప్రతి కుటుంబానికి సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

పారదర్శకత ఓటరు జాబితాకు సహకరించాలి

ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నగర పాలక కమిషనర్ భార్గవతేజ కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాల్‌లో రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశమై ఫారం-6, ఫారం-7, ఫారం-8పై చర్చించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏవైనా ఇబ్బందులు, మార్పులు, చేర్పులు, మరణాలు వంటివి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ఇప్పటికే ఓటరు జాబితాపై సర్వే చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అవీ-ఇవీ

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ కర్నూలు ఏడీఈ-2 రాజేంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సబ్ డివిజన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా సీ.క్యాంప్, గణేష్ నగర్, రెవెన్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీ, సాయి వైభవ్ నగర్, చెక్‌పోస్టు ఏరియా, శేషాద్రి నగర్, బృందావన్ నగర్, మారుతి నగర్, అరుంధతి నగర్, శ్రీరాం నగర్, మారుతి మెగా సిటీ, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మీ నగర్, బీ. క్యాంప్, లక్ష్మీ నగర్, ఎల్కూరు ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అయితే అవకాశం ఉన్న చోట్ల ప్రత్యామ్నాయంగా సరఫరా అందిస్తామని చెప్పారు.

సీనియర్ డాక్యుమెంట్ రైటర్ నబీ బాషా మృతి



నబీబాషా (ఫైల్)

కర్నూలు(సెంట్రల్) : సీనియర్ డాక్యుమెంట్ రైటర్ నబీబాషా (54) అనారోగ్య సమస్యలతో సోమవారం రాత్రి మృతి చెందాడు. ఇతను 1992 నుంచి ఇప్పటి వరకు డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నారు. దాదాపు 32 ఏళ్లపాటు డాక్యుమెంట్లను రాసి ప్రజల మన్నలను పొందాడు. కాగా, నబీబాషా మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న డాక్యుమెంట్ రైటర్ల అసోసియేషన్ నాయకులు రెహమాన్, చాంద్‌బాష, అనుమంతరావు, రామకృష్ణ, చంద్రశేఖర్, శేషు, మహబూబ్‌బాష, మస్తాన్, మహ్మద్ రఫీ ఆయన మృతికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంగళవారం ఉదయం షాపులను మూసి సంతాపం తెలిపారు.

స్టేడియంలో ఉచిత వైద్య శిబిరం

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్టేడియానికి వచ్చిన ప్రజలు, వాకర్స్‌కు బీపీ, షుగర్ వంటి వైద్య పరీక్షలు చేశారు. వ్యాధులను ముందుగానే గుర్తిస్తే జాగ్రత్తలు తీసుకోవచ్చునని లయన్స్ క్లబ్ కర్నూలు ఫోర్ట్ అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. కార్యక్రమంలో సభ్యులు మాణిక్య ప్రభు, రమణగౌడ్, రామరాజు పాల్గొన్నారు.

పీఎం చిత్రపటం ఏర్పాటు చేయాలి

కర్నూలు(రాజ్‌విహార్): స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్ర పటాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సాయి ప్రదీప్ డిమాండ్ చేశారు. మంగళవారం స్టేషన్ అధికారి మున్నోజీరావును ఆపార్టీ నాయకులు కలిసి విన్నవించారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఘనంగా నాయీ బ్రాహ్మణ కార్తీక వనభోజనాలు



మెడికల్ విద్యార్థిని పంకజాక్షికి పుస్తకాలు అందిస్తున్న నాయీ బ్రాహ్మణ నేతలు

కర్నూలు(అర్బన్): ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని, మారుతున్న సమాజానికి అనుగుణంగా తమ పిల్లలను చదివించాలని నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు అన్నారు. మంగళవారం స్థానిక వెంగన్నబావి సమీపంలో నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కన్వీనర్ స్వామి చంద్రుడు అధ్యక్షతన కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి రిటైర్డు అధ్యాపకులు ఎం వెంకటేశ్వర్లు, ఎస్‌పీ మద్దయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా వనభోజన మహోత్సవాలను నిరంతరాయంగా కొనసాగించడం విశేషమన్నారు. ఈ నేపథ్యంలోనే 2023లో జరిగిన నీట్ ఫలితాల్లో కర్నూలు మెడికల్ కళాశాలలో మొదటి ప్రయత్నంలోనే సీటు సాధించిన పి. పంకజాక్షిని ఘనంగా సన్మానించి, మెడికల్ విద్యకు అవసరమైన పుస్తకాలను అందించారు. అలాగే 35 మంది పొదుపు సంస్థ కార్యకర్తలకు వెండి బిల్లలు, స్టీల్ సమాన్లు బహూకరించారు. కార్యక్రమంలో టీఎస్ అక్షర చేసిన యోగా, నాదస్వర కచ్చేరి బృందం కళా నైపుణ్యం ఆకట్టుకుంది. అలాగే 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన 56 మంది విద్యార్థులకు వారి కోర్సులకు సంబంధించి రూ.40 వేలు విలువ చేసే పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, మునిస్వామి, మంగయ్య, కింగ్స్ ప్రసాద్, బిట్టు సురేష్, వేణు, న్యాయవాది బాలసుబ్రమణ్యంతో పెద్ద సంఖ్యలో మహిళలు, నగరంలోని నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

వెంకయ్య నగర్‌లో చోరీ

కర్నూలు : నగర శివారులోని బళ్లారి రోడ్డులో ఉన్న వెంకయ్య నగర్ (రిచ్‌మండ్ విల్లాస్)లో నివాసముంటున్న వేముల వాసు ఇంట్లో దొంగలు పడి అందిన మట్టుకు మూటగట్టుకుని ఉడాయించారు. ఈయన వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి అరుణాచలం వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి పడక గదిలో ఉన్న బీరువాను బద్దలుకొట్టి అందులో ఉన్న 4 తులాల బంగారం, 20 తులాల వెండి, కొంత నగదును మూటగట్టుకుని ఉడాయించారు. పక్కనే ఉన్న మరో రెండు ఇళ్లల్లోనూ చోరీకి విఫలయత్నం చేశారు. మంగళవారం తెల్లవారుజామున వాసు తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచి ఉండటంతో ఆందోళనకు లోనై గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగిందని నిర్ధారించుకుని నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వేముల వాసు ఇంట్లో దొంగలు బీరువాను బద్దలుకొట్టి చోరీకి పాల్పడిన దృశ్యం

భూపాల్‌నగర్‌లో చైన్ స్నాచింగ్...

కర్నూలు మండలం భూపాల్‌నగర్‌లో గొలుసు దొంగ హల్‌చల్ సృష్టించాడు. గ్రామానికి చెందిన రవిశంకర్ భార్య మంజువాణి మంగళవారం ఉదయం ఇంటి ముందు కల్లాపి చల్లేందుకు శుభ్రం చేసుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఆమెను సమీపించి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని ఉడాయించాడు. దొంగ దొంగ అని ఆమె అరిచేలోగా భర్త రవిశంకర్ గౌడ్ ఇంట్లో నుంచి బయటకు వచ్చి దొంగను వెంబడించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. వాహనం వేగం పెంచి కాలనీలోని మరో సందు గుండా కనిపించకుండా పోయాడు.

తగ్గుముఖం పట్టిన అతిసారం

కల్లూరు: రెండు రోజులుగా కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురంలో ప్రబలిన అతిసార వ్యాధి మంగళవారం తగ్గుముఖం పట్టింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 38 ఓపీలు వచ్చాయని మెడికల్ ఆఫీసర్ జ్యోతి తెలిపారు. అందులో 15 మందికి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశామని, 12 మందికి పాఠశాలలోని వైద్య శిబిరంలో ఫ్లూయిడ్స్, బాటిల్స్, మిగిలిన వారికి అవసరమైన మందులు ఇచ్చామని తెలిపారు. అతిసార పూర్తిగా తగ్గే వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను డీఆర్వో కె.మధుసూధన్‌రావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో జిల్లా స్థాయి రోడ్డు, భద్రత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలన్నారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై ఆయన సుదీర్ఘంగా, సమగ్రంగా అధికారులతో చర్చించి , సూచనలు జారీ చేశారు. డీటీసీ శ్రీధర్ మాట్లాడుతూ.. గత సమావేశాల్లో కేంద్రీయ విద్యాలయం సమీపంలో స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించిన నేపథ్యంలో అమలు చేసినట్లు చెప్పారు. హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో చనిపోయిన వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ ఉంటే అతని నెలసరి ఆదాయం, వయసు, ఇతర వివరాలను పరిగణలోకి తీసుకొని రూ.25 లక్షల వరకు ఇన్సూరెన్స్ వస్తుందని యూనైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ప్రతినిధిని నాగార్జున తెలిపారు. ఓర్వకల్ ఎయిర్ పోర్టు, నందికొట్కూరు రోడ్డులోని ఎల్లమ్మ గుడి, ఓర్వకల్ హై వే పక్కన ఉన్న జగనన్న కాలనీల సమీపాల్లో ప్రమాదాలుజరుగకుండా సూచికలను ఏర్పాటు చేస్తున్నట్లు జాతీయరహదారుల అధికారులు తెలిపారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు రోడ్డు సమీపంలో బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని ఆర్‌టీసీ ఆర్‌ఎం జాతీయరహదారుల అధికారులను కోరారు. కర్నూలు బళ్లారి చౌరస్తా దగ్గర హనుమాన్ మందిర్ పక్కన ఉన్న ఎస్‌ఏపీ క్యాంపుకి సంబంధించి నాలుగు దుకాణాల తీసి వేసి గుడి వెనుకనుంచి రహదారిఏర్పాటు చేసుకోవాలని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం కోరారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఆర్‌అండ్‌బీ ఎస్ఈనాగరాజు, జాతీయ రహదారుల అధికారి సుధాకర్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వెంకటరమణ, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్, డీసీఎం మహేష పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



మునగాలపాడు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం కర్నూలు అర్బన్ పరిధిలోని 38వ వార్డు మునగాలపాడు సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను, సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో పేదలకు, అర్హులకు సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ఇంటి వద్దకే వచ్చి పథకాలు, ప్రభుత్వ సేవలు అందజేస్తున్నామన్నారు. పేదల పిల్లలు బాగా చదువుకోవాలని అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక, విదేశీ విద్యా దీవెనలతో పాటు ఇంగిషు మీడియం విద్య, డిజిటల్ విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఇలా వివిధ రూపాల్లో బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలబడుతున్న వైఎస్ జగన్‌ను వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు

తెలుగు దేశం పార్టీ ఐదేళ్ల అధికారంలో ఉన్నా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు ఇప్పటికే అమలు చేసిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కారం చేసేందుకు ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో స్థానికులు సుంకన్న, పక్కీరన్న, మహేష్ గౌడ్, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.